# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 25-08-2025 సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సాంఘిక సంక్షేమ శాఖపై ఈరోజు సమీక్ష నిర్వహిస్తున్నారు.**
2. **స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఈరోజు విజయవాడలో ప్రారంభించారు.**
3. **అమృత్ పథకం ద్వారా ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తామని పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ పేర్కొన్నారు.**
4. **రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తోందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.**
5. **రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్ అందిస్తున్నామని విద్యుత్ శాఖ మంత్రి మంత్రి గొట్టిపాటి రవికుమార్ వెల్లడించారు.**

==========================

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సాంఘిక సంక్షేమ శాఖపై ఈ రోజు సమీక్ష నిర్వహిస్తున్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జరుగుతున్న ఈ సమావేశంలో సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాలపై సంబంధిత అధికారులతో ముఖ్యమంత్రి చర్చిస్తున్నారు. అనంతరం ఆరోగ్యశాఖ, జలవనరులశాఖలపై సమీక్ష నిర్వహిస్తారు. అలాగే సాయంత్రం హంద్రినీవా సుజల స్రవంతి పథకం అమలుపైనా సమీక్ష నిర్వహించనున్నారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

--------------------------

ప్రజల అవసరాల దృష్ట్యా రాష్ట్రంలో చౌక ధరల దుకాణాలను పెంచనున్నామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. విజయవాడలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని మంత్రి ఈ రోజు ప్రారంభించి లబ్ధిదారులకు కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాంకేతికత వినియోగంతో స్మార్ట్ రేషన్‌కార్డులు తయారు చేశామని వీటిలో క్యూఆర్ కోడ్ ద్వారా రేషన్ తీసుకోగానే కేంద్ర, జిల్లా కార్యాలయాలకు సమాచారం అందుతుందని తెలిపారు. 9 జిల్లాల్లో ఈరోజు ఇంటింటికీ రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్నామని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్..34 సెకన్లు

-----------------------------

కేంద్రప్రభుత్వ అమృత్ స్కీం పథకం కింద రాష్ట్రంలో రాబోయే మూడేళ్లలో ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తామని పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు. తిరుపతిలోని తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ తుడా కార్యాలయంలో నగరపాలక సంస్థ అధికారులతో మంత్రి నారాయణ ఈరోజు సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం పాత్రికేయులతో మంత్రి మాట్లాడుతూ,

వాయిస్..33 సెకన్లు

-----------------------------

రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తోందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు మంత్రి నిన్న అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 31 మందికి సహాయాన్ని అందించేందుకు 20 లక్షల రూపాయల చెక్కులను పంపిణీ చేశామని చెప్పారు. ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆరోగ్య భద్రత కల్పిస్తున్నామని మంత్రి వివరించారు.

-----------------------------

రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్ అందిస్తున్నామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేట మార్కెట్ యార్డ్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో నరసారావు పేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలుతో కలిసి మంత్రి నిన్న పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో 64 లక్షల మందికి పింఛన్‌లను ఇస్తున్నామని, కొత్తగా లక్షా పదివేల పింఛన్లను మంజూరు చేశామని మంత్రి తెలియజేశారు.

-----------------------------

తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ఈరోజు దర్శించుకున్నారు. దర్శన అనంతరం ఆలయం వెలుపల కేంద్రమంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ, తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ఆపరేషన్ సిందూర్‌తో భారత సైనికుల శక్తి ప్రపంచానికి తెలిసిందని మంత్రి పేర్కొంటూ,

వాయిస్.. 34 సెకన్లు

-----------------------------

గుంటూరులో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు శంకరవిలాస్ వదంద నూతన పై వంతెన ఉపయోగపడుతుందని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరులో శంకరవిలాస్ నూతన వంతెన నిర్మాణ పనులను నగర మేయర్ కె. రవీంద్రతో కలిసి ఆయన నిన్న పరిశీలించారు. నగర పాలక, ఆర్ అండ్ బీ అధికారుల సమన్వయంతో నూతన వంతెన నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని ఈ సందర్బంగా కేంద్రమంత్రి తెలియజేస్తూ,

వాయిస్ ..34 సెకన్లు

-----------------------------

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ అధ్వర్యంలో ఈ నెల 29వ తేదీన కైకలూరులో ఉద్యోగ మేళాను నిర్వహిస్తున్నామని ఏలూరు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి యన్. జితేంద్ర ఒక ప్రకటనలో తెలిపారు.కైకలూరులో జరిగే ఈ మేళాలో 10కి పైగా సంస్థలు పాల్గొంటాయని, పదవ తరగతి, ఇంటర్, ఐ.టి.ఐ, డిగ్రీ, పి.జి విద్యార్హతలు కలిగి ఉన్న యువత పాల్గొనవచ్చని చెప్పారు. ఈ ఉద్యోగ మేళాకు హాజరయ్యే అభ్యర్థులు naipunyam.ap.gov.in వెబ్‌సైట్‌లో తమ పూర్తి వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు.

---------------------------

స్వదేశీ సాంకేతికతతో తయారు చేసిన నీలగిరి శ్రేణి నౌకలైన ఐఎన్ఎస్ హిమగిరి, ఐఎన్ఎస్ ఉదయగిరిలను రేపు జాతికి అంకితం చేయనున్నారు. తూర్పు నౌకాదళ కేంద్రమైన విశాఖపట్నంలోని డాక్‌యార్డులో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, నౌకాదళ అధిపతి అడ్మిరల్ దినేష్‌కుమార్ త్రిపాఠి హాజరుకానున్నారు. వ్యూహాత్మక రక్షణ ప్రాజెక్టు పనుల్లో భాగంగా పీ-17 పేరిట స్వీయ సాంకేతికత, ఆధునిక కమ్యూనికేషన్ వ్యవస్థలతో కోల్‌కతా, ముంబయిలలో ఈ యుద్ధ నౌకలను భారత రక్షణ వ్యవస్థ నిర్మించింది.

---------------------------

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈ రోజు లాభాలలో కొనసాగుతున్నాయి. మధ్యాహ్నం ఒంటిగంట సమయానికి సెన్సెక్స్ 403 పాయింట్ల లాభంతో 81 వేల 719 వద్ద ట్రేడవుతుండగా, నిఫ్టీ 120 పాయింట్ల లాభంతో 24 వేల 991 వద్ద ట్రేడవుతోంది.

---------------------------

వాయువ్య బంగాళాఖాతంలో ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీరాలకు సమీపంలో ఈరోజు అల్పపీడనం ఏర్పడే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఈరోజు, రేపు రాష్ట్రంలోని ఉత్తరాంధ్ర జిల్లాల్లో పలు చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి ఎల్. నారాయణ తెలియజేస్తూ...

వాయిస్..24 సెకన్లు

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 125వ సంచిక ఈనెల 31వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది."మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 29వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

=====================